

7లోగా గుర్తింపుకార్డులకు దరఖాస్తులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని పలు కళాజాతా బృందాల సభ్యులు గుర్తింపుకార్డుల కోసం ఈనెల ఏడో తేదీలోగా తమ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపుకార్డులు కోరే కళాకారులు తమ పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, బ్లడ్ గ్రూప్, కళారంగం, అనుభవం, ఫోన్ నంబరు, ఆధార్, ఇ-మెయిల్, కుల, ఆదాయ వివరాలతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జత చేసి సమర్పించాలని పేర్కొన్నారు. వీటితోపాటు కళాకారునిగా తహశీల్దార్ ధ్రువీకరించిన పత్రాన్ని జత చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. దరఖాస్తులను ఈనెల 7వ తేదీ లోగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ, అఫీషియల్ కాలనీ, జెసి గారి బంగ్లా దరి, శ్రీకాకుళం వారికి నేరుగా గానీ పోస్టు ద్వారా గానీ సమర్పించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నత్తనడకన 'గడప గడప' పనులు

- పనుల గుర్తింపు, ప్రతిపాదనలు పంపడంలో ఆలస్యం
- 2,309 పనులకు జిల్లా కమిటీ ఆమోదం
- ఇప్పటివరకు 176 పనులు పూర్తి
- పాత పనులకు బిల్లులు రాకపోవడం జాప్యానికి మరో కారణం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జిల్లాలో మందకొడిగా సాగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు సచివాలయాల సందర్శనకు పెద్దగా సమయం వెచ్చించడం లేదు. దీని ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరుగనున్నందున ఈ ఏడాది డిసెంబరు లోగా పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. గడప గడపకు పనుల పూర్తిపై ప్రభుత్వం తొందరగా ఉన్నా, క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. గతంలో పనులు చేపట్టిన వారికి బిల్లులు రాకపోవడంతో వైసిపి స్థానిక నాయకులు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతోపాటు ఎమ్మెల్యేలు గడప గడప లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకబాటు కనిపిస్తోంది. ఇళ్ల సందర్శన పూర్తయితే గానీ పనుల గుర్తింపు, మంజూరుకు అవకాశం లేకపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



బూర్జ మండలం లక్కుపురంలో అధ్వానంగా రహదారి

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఇంటినీ ఎమ్మెల్యేలు సందర్శించేలా ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గతేడాది మే 11వ తేదీన ప్రారంభించింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని అన్ని ఇళ్లకు వెళ్లాలని ప్రజాప్రతినిధులను ఆదేశించింది. ఇందులో భాగంగా వారు పర్యటించిన ప్రాంతాల్లో మౌలిక వసతులు, కనీస సౌకర్యాల కోసం ప్రజల నుంచి వచ్చే వినతుల కోసం సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయిస్తూ 2022 ఆగస్టు 17న జిఒ నంబరు 123 విడుదల చేసింది. పనుల గుర్తింపు, మంజూరు, నిర్వహణ, పర్యవేక్షణపై ప్రత్యేక మార్గదర్శకాలను వెలువరించింది. అందుకనుగుణంగా జిల్లాలో గతేడాది ఆగస్టు నుంచి ఎమ్మెల్యేలు సచివాలయాల సందర్శన మొదలుపెట్టారు. జిల్లాలో 732 సచివాలయాల పరిధిలో 2,477 రకాల పనులకు రూ.70.14 కోట్లతో పరిపాలనా ఆమోదం తెలిపారు. వీటిలో అన్ని మండలాల నుంచి రూ.65.67 కోట్ల విలువైన 2,181 పనులకు సంబంధించి అంచనాలను పంపారు. ఇంకా రూ.14.64 కోట్ల విలువైన 118 రకాల పనులకు సంబంధించి అంచనాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం 1464 పనులు ప్రగతిలో ఉన్నాయి. ఇప్పటివరకు పూర్తయిన 176 రకాల పనులకు రూ.5.47 కోట్ల మేర బిల్లులు చెల్లించారు.

సాంకేతిక సమస్యలతో పనుల్లో జాప్యం

సచివాలయాల వారీగా గుర్తించిన పనుల జాబితాను ఎంపిడిఒలు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు పంపుతున్నారు. వాటిలో నిబంధనల ప్రకారం ఉన్న పనులకు ఉన్నతాధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. పనుల్లో అత్యధిక భాగం పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్‌శాఖలకు సంబంధించినవే ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. పంచాయతీరాజ్ ద్వారా చేపడుతున్న పనులపై ప్రభుత్వం కొత్తగా కొన్ని మార్గదర్శకాలు వెలవరించడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. గతంలో రూ.2.50 లక్షల పనిని నామినేషన్ పద్ధతిపై అప్పగించేవారు. ప్రభుత్వం కొత్తగా వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం వాటికీ టెండర్లను పిలవాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. ఈ కారణంతో పనుల్లో కొంత జాప్యం చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పనులకు ఆసక్తి చూపని నాయకులు

గడప గడపకూ పనులను చేపట్టేందుకు గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలతో పాటు స్థానిక వైసిపి నాయకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. పనులు చేస్తున్నా సకాలంలో బిల్లులు రావడం లేదని వారు చెప్తున్నారు. దీంతో పాటు గతంలో ముఖ్యమంత్రి డెవలప్‌మెంట్ నిధులు (సిఎండిఎఫ్)తో పనులు చేసినా ఆ బిల్లులు నేటికీ రాలేదు. సిఎండిఎఫ్ నిధులు మురిగిపోవడంతో బిల్లులు రావడం సందేహంగా ఉంది. పనుల కోసం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో కొత్తగా డబ్బులు మదుపు పెట్టడానికి ఎవరూ సాహసించడం లేదు. ఫలితంగా పనులు మంజూరవుతున్నా గ్రౌండింగ్ కావడం లేదు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

5న ఉక్కు రక్షణ బహిరంగసభ

- జయప్రదం చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో భాగంగా ఈనెల ఐదో తేదీన స్టీల్‌ప్లాంట్ వద్ద ఉక్కు రక్షణ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో అశేష త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. మరో 25వేల ఉద్యోగాలకు అవకాశముందని తెలిపారు. విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం రూ.4,980 కోట్లు పెట్టుబడి పెడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54 వేల కోట్ల ఆదాయం సమకూర్చిందన్నారు. బంగారు బాతు వంటి ప్లాంట్‌ను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టిందని తెఇపారు. ప్రజా ద్రోహ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉక్కు సంకల్పంతో స్టీల్‌ప్లాంటు కార్మికులు, కార్మిక, ప్రజాసంఘాలు 950 రోజులకు పైగా పోరాడుతున్నారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాల్సిన అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, అన్యాయాన్ని ప్రశ్నిస్తానన్న జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వం ముందు సాగిలపడుతున్నాయని విమర్శించారు. ద్రోహం చేస్తున్న బిజెపిని వదిలేసి, అధికార యావతో తమలో తాము కలహించుకుంటున్నాయన్నారు. మోడీ ప్రభుత్వానికి కావాల్సింది ఇదేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి అమ్మాలనే కుట్ర పన్నిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్లాంటు రక్షణ ఉద్యమం ప్రారంభించిన నాటి నుంచి సిపిఎం ఈ ఉద్యమంలో తనవంతు కీలకపాత్ర పోషిస్తోందని, ప్రజా ఉద్యమంగా మలిచే కృషి చేస్తోందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల సిపిఎం కార్యదర్శులు రెండు రోజులు దీక్షలు చేపట్టారని, ఈ ఉద్యమానికి విశాల ప్రజా మద్దతు కూడగట్టడానికి సెప్టెంబరు 20 నుంచి ఉక్కు రక్షణ బైక్ యాత్ర చేపట్టిందని వివరించారు. 20న విశాఖలో ప్రారంభమైన ఈ యాత్ర విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు పర్యటిస్తూ విశాఖలో ముగుస్తుందన్నారు. జాతాకు ఉత్తరాంధ్ర ప్రజానీకం ఘన స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. విశాఖ ఉక్కును రక్షించుకోవాలనే స్పందన ప్రజల్లో వ్యక్తమవుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మితే మిగతా ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోలేమన్నారు. ఇదే జరిగితే ఉన్న ఉద్యోగాలు, ఉపాధి పోతుందని, కొత్త ఉద్యోగాలు రావని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపకపోతే తగిన గుణపాఠం తప్పదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించేందుకు నిర్వహిస్తున్న సభలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని స్టీల్‌ప్లాంట్ రక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

రాష్ట్రంలో రాక్షస పాలన

- అరెస్టులకు భయపడేది లేదు
- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, పలాస, కోటబొమ్మాళి

రాష్ట్రంలో కక్షపూరిత రాక్షస పాలన సాగుతోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఇచ్ఛాపురం, పలాస, కోటబొమ్మాళిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కుట్ర పన్ని కేసులు పెట్టారన్నారు. చంద్రబాబు ఎటువంటి తప్పు చేయకున్నా ఆయన్ను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. నిజాలన్నీ బయటకు వస్తాయని, కాకపోతే కొంచెం సమయం పడుతుందన్నారు. అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించినంత మాత్రాన భయపడేది లేదన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫేస్టోతో వైసిపి వణుకు పుట్టిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే అక్రమ అరెస్టులకు పాల్పడిందన్నారు. చంద్రబాబు జైలు నుంచి వచ్చి ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారని చెప్పారు. పవన్ కళ్యాణ్ కూడా టిడిపితో కలిసి వస్తున్నారని, వారినీ మనం ఆదరించాలన్నారు. పలాసలో అధికార పార్టీ నాయకులు ఏదో ఒక వివాదం సృష్టించి టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కోటబొమ్మాళిలో దీక్షలకు జనసేన నాయకులు కణితి కిరణ్ కుమార్ సంఘీభావం తెలిపారు. తెలగ సంఘ నాయకులు కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, వజ్జ బాబూరావు, నాయకులు పీరుకట్ల విఠల్, కాళ్ల ధర్మారావు, కొండా శంకర్‌రెడ్డి, లొడగల కామేష్, బోయిన రమేష్, బోయిన గోవిందరాజులు, కింజరాపు హరివరప్రసాద్,˝మంలో మాజీ ఎమ్మెల్యే శివాజీ, పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు

- డ్రైవర్ మృతి
- ఆరుగురికి గాయాలు



రమేష్ మృతదేహం

పలాస : మండలంలోని పాత జాతీయ రహదారి కోసంగిపురం రోడ్డులో ఆదివారం ఆటోను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో ఇచ్ఛాపురం మండలం డొంకూరుకు చెందిన ఆటో డ్రైవర్ రమేష్ (33) మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటకు చెందిన జి.రాంబాబు ఇచ్ఛాపురం మండలం డొంకూరుకు చెందిన అమ్మాయిని రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఐదు నెలల కుమార్తె ఉంది. వీరి మధ్య మనస్పర్ధలు రావడంతో కొత్తపేటలో ఉన్న రాంబాబు తల్లిదండ్రుల సమక్షంలో పంచాయితీ పెట్టేందుకు డొంకూరు గ్రామ పెద్దలు ఆటో బుక్ చేసుకుని వెళ్తున్నారు. కోసంగిపురం మలుపు వద్ద ఆటోను విశాఖ నుంచి మందస వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ రమేష్, ముద్దాడ దేవమ్మ, బత్తుల ఎర్రయ్య, రాంబాబు, వి.పార్వతి, మాధవరావు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తన పెట్రోలింగ్ వాహనంలో పలాస ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. వైద్యులు చిన్నంనాయుడు ప్రథమ చికిత్స చేసి, టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రమేష్ మృతిచెందాడు. మిగతా క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. మృతునికి భార్య, తొమ్మిది నెలల కుమార్తె ఉన్నారు. రమేష్ మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాశీబుగ్గ సిఐ శంకరరావు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- స్వచ్ఛత మన నినాదం కావాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



చెత్తను సేకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత మన నినాదం కావాలని ఆకాంక్షించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యాన స్వచ్ఛతా హీ సేవా అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్ అరసవల్లి, రోటరీ క్లబ్ శ్రీకాకుళం ప్రతినిధులు, ఎన్‌సిసి క్యాడెట్స్, పలు కళాశాలల విద్యార్థులతో కలిసి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉన్న చెత్తను స్వయంగా సేకరించి పరిశుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవా బ్యానర్‌పై కలెక్టర్ తొలి సంతకం చేశారు. ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. పరిసరాల పరిశుభ్రతలో దశాబ్ద కాలంలో దేశం ఎంతో పరిణితి సాధించిందని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు ఇలాంటి విషయాల్లో చాలా కఠినంగా వ్యవహరిస్తాయన్నారు. స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. పరిశుభ్రతే మహాత్మునికి మనం ఇచ్చే నివాళి అని అన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు మన ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. ప్రతిరోజూ గంట సమయం పరిసరాల పరిశుభ్రతకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సురేఖ, క్షేత్ర ప్రచార అధికారి తారక్ ప్రసాద్, డిఐపిఆర్‌ఓ చెన్నకేశవరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకట్రావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వంశధార నిర్వాసితులకు...

అదనపు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారాన్ని వెంటనే చెల్లించాలని వంశధార నిర్వాసితుల సంఘం నాయకులు గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అదనపు పరిహారం పేరుతో రూ.216.77 కోట్లు చెల్లిస్తున్నామని చెప్పి, సగం మందికి చెల్లించి మిగిలిన వారికి ఏడాదిన్నర దాటుతున్నా చెల్లించలేదని తెలిపారు. సత్తా చాటాలన్నారు. ఈనెల మూడో వారంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్నారని, ఆ సమయం లోగా వంశధార నిర్వాసితుల అదనపు పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేకుంటే నిర్వాసితులను ఏకం చేసి సిఎం పర్యటనను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.

దసరా లోపు విశాఖ-వారణాసి రైలు

శ్రీకాకుళం అర్బన్ : ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకబాటుకు రాజకీయ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బిజెపి రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్ నర్సింహారావు అన్నారు. నగరంలోని అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం దర్శించుకున్న అనంతరం ఒక హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న పార్టీలు ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశాయన్నారు. దేశంలోనే అతి తక్కువ తాగునీటి సదుపాయం ఉన్న జిల్లాలుగా ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ఉన్నాయన్నారు. దసరా లోపు విశాఖ-వారణాసి రైలును ప్రారంభించే అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత యాజమాన్యం, కార్మికులపైనే ఉందన్నారు. చంద్రబాబు అరెస్టుపై విలేకరులు ప్రశ్నించగా, న్యాయస్థానం పరిధిలో ఉన్న వాటిపై తాను మాట్లాడబోనన్నారు.

ముందస్తు ప్రణాళికలతో 'ఉపాధి' పనుల గుర్తింపు

- క్షేత్రస్థాయిలో అంచనాలు తయారు
- గ్రామ పంచాయతీ యూనిట్‌గా పనులు
- డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల గుర్తింపునకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు తెలిపారు. ఇప్పటికే ప్లానింగ్ ప్రక్రియను ప్రారంభించామన్నారు. పూడికతీత పనులతో పాటు కొత్తగా పనులు గుర్తించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జాబ్‌కార్డు ఉన్న ఉపాధి కూలీలందరికీ పనులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టి కూలీలకు పూర్తిస్థాయిలో డబ్బులను చెల్లించామన్నారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

ఉపాధి పనుల గుర్తింపు ప్రక్రియ ఎలా సాగుతోంది?

ఉపాధి హామీ అమల్లో జిల్లా ముందంజలో ఉంటోంది. జిల్లాలో ఉపాధి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టబోయే పనులను గుర్తించే ప్రక్రియ మొదలుపెట్టాం. 900కు పైగా గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పనులను గుర్తిస్తున్నాం. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో చర్చించి పనులను గుర్తిస్తున్నాం. ఇప్పటివరకు పూడికతీత పనులకు ప్రాధాన్యత ఉండేది. వీటితోపాటు నిబంధనలకు లోబడి కొత్త పనులు గుర్తిస్తున్నాం.

ఈ ఏడాది ఎంతమేరకు ఉపాధి లక్ష్యాలను అధిగమించగలిగారు?

జిల్లాలో సుమారు 6.50 లక్షల మందికి పైగా ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. వారందరికీ పని కల్పించాలన్నదే లక్ష్యం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టి కూలీలకు పూర్తిస్థాయిలో కూలి మొత్తాలు చెల్లించాం. రోజుకు గరిష్ట కూలి రూ.272 పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ప్రణాళికకు అనుగుణంగా పనులు చేయకపోవడంతో గరిష్ట కూలి పొందడంలో కొంత వ్యత్యాసాలున్నాయి. అటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఈసారి పనులు గుర్తించడం, ఎక్కువ పనిదినాలు కల్పించి గరిష్ట కూలి అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

మెటీరియల్ కాంపోనెంట్ లక్ష్యం ఎంతమేరకు నెరవేర్చారు?

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు శాశ్వత ప్రాతిపదికన నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విడతల వారీగా ఈ భవన నిర్మాణాలు పూర్తి చేయడమవుతోంది. జగనన్న కాలనీల అభివృద్ధికి ఉపాధి పనులను అనుసంధానం చేయడం వల్ల మౌలిక వసతుల కల్పనకు ఉపకరిస్తున్నాయి. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజి నిర్మాణం పనులు చేపట్టేందుకు వీలుంది. ఆదిశగా ఉన్నత స్థాయిలో చర్చించి పనులు మంజూరు చేయడమవుతోంది. వీటితోపాటు గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఏరియా బల్క్ మిల్క్ యూనిట్లు నిర్మాణం, వాటికి అదనపు సౌకర్యాలు సమకూర్చు కునేందుకు వీలు కల్పిస్తున్నాం. పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయడం వల్ల అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.





చెల్లింపులు ఎంతమేరకు పూర్తి చేశారు?

జిల్లాలో ఉపాది కూలీలందరికీ సకాలంలో చెల్లింపులు చేస్తున్నాం. మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో సకాలంలో చెల్లింపులు కావాలంటే, వాటికి సంబంధించిన బిల్లులు సకాలంలో ఆన్‌లైన్‌లో ఉంచాలి. ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఇది సాధ్యమవుతుంది. ప్రస్తుతం జిల్లాలో సుమారు రూ.38 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వాటికి సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక పరమైన ఇబ్బందుల వల్ల కొంత ఆలస్యమైంది. ఈ బకాయిలు త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మొక్కల సంరక్షణ చర్యలు చేపడుతున్నారా?

జిల్లాలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ ఏడాది కోటి మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించాం. నాటిన ప్రతి మొక్క జీవించే విధంగా సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో వాటి సంరక్షణకు పర్యవేక్షణ చేపడుతున్నాం.

నేడు పోలీసు 'స్పందన' లేదు



శ్రీకాకుళం : ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమం ఈనెల రెండో తేదీన గాంధీ జయంతి సెలవు దినం సందర్భంగా నిర్వహించడం లేదని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు వ్యయప్రయాసలకోర్చి రావద్దని, ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పరిశుభ్రతతో ప్రజారోగ్యం

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

స్వచ్ఛతా హి సేవా శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిఇఒ వెంకటరామన్, డిఇఒ రవికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే ట్రిబుల్ ఐటిలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఒఎస్‌డి ఎల్.డిసుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకాడమిక్ డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సల్లా అసిరినాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు, పిఒలు డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు, డాక్టర్ వి.సింహాచలం, డాక్టర్ ఈశ్వరరావు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

పోలాకి సచివాలయం నుంచి ప్రధాన మార్కెట్ వరకు స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, ప్రతినిధి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, కరిమి రమణ, కరిమి శ్రీను, పైల అప్పన్న, బరాటం కృష్ణారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో 'స్వచ్ఛతా హి సేవా'లో భాగంగా గాంధీపార్కులో శ్రమదానం చేపట్టారు. ప్రతిజ్ఞ అనంతరం పాతబస్టాండ్ వరకూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, కౌన్సిలర్లు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తిరెడ్డి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు సచివాలయం వద్ద సర్పంచ్ సరిత, కరుణార్ ఆధ్వర్యాన స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ ఆవరణలో యువకులు శ్రమదానం చేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి కొయిరి ఢిల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే గరుడుభద్ర పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు, సర్పంచ గిరిజ, ఈశ్వరరావు, రాజాం సర్పంచ్ పిట్ట గీతారాణి, సచివాలయ కన్వీనర్ ఎ.దానేష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి మండలంలోని స్వచ్ఛాతా హైలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. ఎంపిడిఒ పి.చంద్రకుమారి అవగాహన కల్పించాఉ.

పలాస ప్రభుత్వాస్పత్రిలో అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, డాక్టర్ చిన్నంనాయుడు, సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్రకుమార్ ఆధ్వర్యాన, బ్రహ్మణతర్లాలో స్వచ్ఛతా హైపై అవగాహనా ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, సర్పంచ్ బి.పుష్ప, ఎంపిటిసి తుంగాన రవాణమ్మ పాల్గొన్నారు.

టెక్కలి సర్పంచ్ గొండెలి సుజాత ఆధ్వర్యాన స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరిపాలన అధికారి హనుమంతు వెంకటరమణమూర్తి, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి బసవల ధనుంజయరావుశశి, జోగారావు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి మండలం బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వర్ధన్, గృహసారథి కోదండ, చంద్రరావు, త్రినాథరావు, ఆనందరావు, వెంకటరావు పాల్గొన్నారు.

స్థానిక మండల పరిషత్ ఆవరణ, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాల ఆవరణలో స్వచ్ఛతా హాయ్ సేవ కార్యక్రమంలో పరిసరాలను శుభ్రంగా చేశారు. పాతబస్టాండ్ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కావ్యశ్రీ పాల్గొన్నారు. కోటబొమ్మాళి పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు, వైఎస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావులు శ్రమదానం చేశారు.

కవిటి మండలంలో పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం ముడిపడి ఉందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కవిటి మండలం కొత్తపుట్టుగ గ్రామంలో ఆదివారం జరిగిన స్వచ్ఛత హైసేవా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ పరిసరాలు పరిశుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎవరికి వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల అనేక వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చునన్నారు. అదేవిధంగా మేజర్ పంచాయతీ కవిటిలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఇఒ వీరభద్రస్వామి, మండల రిసోర్స్ కో- ఆర్డినేటర్ ఎస్. జీవనమూర్తి, మండలంలోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస మండలంలో మానవాళి మనుగడకు మూలాధారమైన స్వచ్ఛతే ప్రతిఒక్కరి ధ్యేయం కావాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతే సేవ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ పరిసరాల్లో పరిశుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి రైల్వేస్టేషన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వన్ వే సెంటర్లోని గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి స్వచ్ఛతే సేవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఒలు కె.అప్పలనాయుడు, బి.సృజన, మేనేజర్ లక్ష్మీనారాయణ, బి.సాయి, ఆర్ఐ డి.రామారావు, వైసిపి నాయకులు దుంపల శ్యామలరావు, అల్లంశెట్టి ఉమామేశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, బి.రామారావు పాల్గొన్నారు.

పొందూరు పట్టణంలో ప్రభావతి జాగృతి ట్రస్టు వ్యవస్థాపకులు సప్పటి వసంతరావు ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ రహదారిలో ప్రధాన కాలువలోని మురుగు, చెత్తా చెదారాలను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపర్చారు. ఈ కార్యక్రమంలో మాడుగుల దీప్తి, పాతిన గణేష్ పాల్గొన్నారు. మండలంలోని లోలుగు కెజిబివిలో ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య ఆధ్వర్యంలో ఏక్ తారీఖ్ ఏక్ గంట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

రణస్థలం మండలంలో స్వచ్ఛత సేవలో ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నడుకుదిటి తేజబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం మండల కేంద్రం జెఆర్.పురం, కొండములగాంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ, ఎస్ఐ జి. రాజేష్, సిఆర్‌పి యు.శ్రీనివాసరావు, ఎన్ఇఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్. సుధీర్ కుమార్, యరమనేడి వెంకటేశ్వరరావు, సిహెచ్‌సి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం మండలం వాంద్రంగి గ్రామంలో గ్రామ సర్పంచ్ సాకేటి నాగరాజు ఆధ్వర్యంలో జగనన్న స్వచ్ఛ సంకల్ప స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలో కెజిబివి పాఠశాలలో ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మండలంలో పలు హాస్టళ్ళ, పంచాయతీల్లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బగాది భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గౌరీ శంకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ యువత పాల్గొన్నారు.



రణస్థలం రూరల్: చెత్తను తరలిస్తున్న అధికారులు, ఎన్ఇఆర్ స్కూల్ సిబ్బంది


కవిటి : పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు


ఆమదాలవలస : ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


సంతబొమ్మాళి : పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నెలలో మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ ప్రదర్శనలో నవలలు, కథలు, కాంపిటేటివ్ బుక్స్, ఆటో బయోగ్రఫీ, ఆధ్యాత్మిక గ్రంథాలు, వార, పక్ష, మాస పత్రికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి మాట్లాడుతూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం వలన చెడు ఆలోచనలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చని మంచి అభివృద్ధి మార్గంలో నడవవచ్చని అన్నారు. గ్రంథాలయ దరఖాస్తు రుసుమును చెల్లించి గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను ఇంటికి తీసుకు వెళ్లవచ్చునని, అనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ ప్రతినెల మొదటి ఆదివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ప్రతి ఆదివారము చదవడం మాకిష్టం కార్యక్రమం ఉంటని తెలిపారు. గ్రంథాలయ సహాయకులు బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారము చదవడం మాకిష్టం, మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యూఢిల్లీలో ఉన్న స్వామి నారాయణ అక్షరధామ్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. భారతీయ కళలను, అసమాన ప్రజ్ఞ విశేషాలను, ఆలోచన విలువలను కలబోసి భారత రాజధాని నగరం న్యూఢిల్లీలో నిర్మించిన అద్భుతీయ ప్రాంగణం, సాంస్కృతిక యాత్రాస్థలం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయ తరుపున ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

భరతనాట్యంలో చిన్నారి ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

రాజమహేంద్రవరంలోని స్వర్ణమహతి కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతముని ఆరాధనోత్సవాల్లో భాగంగా జరిగిన భరతనాట్య నృత్య ప్రదర్శనలో మండలంలోని లచ్చయ్యపేటకు చెందిన సనపల స్నేహాంజలి ఎంతగానో ఆకట్టుకుంది. ఉత్తమ ప్రదర్శనతో ప్రత్యేక బహుమతిని సొంతం చేసుకుంది. బహుమతిని స్వర్ణమహతి కళాపరిషత్ అధ్యక్షులు చందనపూడి ఆదిత్య కిరణ్, గౌరవ అతిథి ఎంపీ లోకేశ్ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు. స్నేహాంజలి ప్రముఖ నృత్యకారిణి సౌమ్య మల్లికార్జున్ వద్ద భరత నాట్యంలో శిక్షణ తీసుకుంటుంది. ఈ చిన్నారి ప్రముఖ సేవకులు వెల్లయ్య మాస్టర్ మనవరాలు.


బహుమతిని అందుకుంటున్న స్నేహాంజలి

కిడ్నీ వ్యాధి మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

వజ్రపుకొత్తూరు : కిడ్నీ వ్యాధితో మృతి చెందిన కుటుంబాలకు రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు బమ్మిడి ఆనందరావు, ఆల్ ఇండియా పీపుల్స్ ఫోరం నాయకులు బి.వాసుదేవరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని బెండిగేట్ సెంటర్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధితో అనేక వందల మంది చనిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ వ్యాధితో 45 ఏళ్ల లోపల ఉన్న యువతీ, యువకులు, శరీర దారుఢ్యం కలిగిన క్రీడాకారులు, వెయిట్ లిఫ్టర్స్, కళాకారులు చనిపోవడం ఆందోళన కలిగిస్తుందని వారన్నారు. ఈ వ్యాధితో చనిపోతున్న వారిని చూసి ప్రజలు కంటతడి పెడుతున్నా పాలకులు మాత్రం అది మన సమస్య కాదన్నట్లు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల ప్రజా సంఘాలు కొన్ని గ్రామాల్లో పర్యటించినప్పుడు కిడ్నీ వ్యాధితో భార్యాభర్తలు చనిపోయి చిన్నపిల్లలు అనాథలై ఉన్నారని అన్నారు. అట్లాంటి పిల్లలను గుర్తించి పీజీ వరకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ వ్యాధి సోకి క్రియేటిన్ 2 పాయింట్లు దాటిన ప్రతి రోగీ శారీరక శ్రమ చేయకుండా, పౌష్టిక ఆహారం తీసుకుంటే కొంతకాలం బతికేదానికి అవకాశం ఉంటుందని వైద్యనిపుణులు చెపుతున్నారని అన్నారు. వారికి ఇచ్చే పెన్షన్ నెలకు రూ.20 వేలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. సిఐటియు నాయకులు ఎన్.మోహనరావు, ,రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు నెయ్యల చంద్రయ్య, ఐద్వా జిల్లా నాయకులు బి. సుగుణవతి, కిసాన్ మహాసభ నాయకులు వంకల అప్పయ్య, సార పాపయ్య, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జడ్డే జోగారావు, వంకల తవిటయ్య, ఐప్వా నాయకురాలు బి.విజయ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఎఎంసి వైస్ చైర్మన్ వెంకటరావు మృతి

ప్రజాశక్తి- పొందూరు


వెంకటరావు (ఫైల్)

పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, ప్రస్తుతం పొందూరు ఎఎంసి వైస్ చైర్మన్ జరజాపు వెంకటరావు ఆదివారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన సుమారు రెండున్నర దశాబ్దాలు పాటు పాత్రికేయులుగా వివిధ పత్రికలలో పనిచేశారు. ప్రస్తుతం ఎఎంసి వైస్ చైర్మెన్‌గాను, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. ఈయన మృతికి ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎఎంసి చైర్మెన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి సెక్రటరీ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, పొందూరు, జి.సిగడాం మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు తమ సంతాపాన్ని తెలిపారు.

జూదరుల అరెస్టు

పొందూరు: మండలం కింతలి గ్రామంలో పేకాట ఆడుతున్న పదిమందిని ఆదివారం శ్రీకాకుళం స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.80,482 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కారయ్య సేవలు ఆదర్శం

టెక్కలి : పిట్టలసరియా మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి గండేటి కారయ్య సేవలు అందరికీ ఆదర్శమని ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు అన్నారు. పిట్టలసరియాలో కారయ్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారయ్య యాదవ సంఘ నాయకునిగా, సర్పంచ్‌గా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, యాదవ సంఘం అధ్యక్షులు నర్తు నరేంద్ర, మాజీ ఎంపిపి సంపతరావు రాఘవరావు, దువ్వాడ హైందవి మోహన్, బర్ల తవితయ్య, వాకాడ శ్రీధర్‌రెడ్డి, ఆట్ల రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలోని రైతు బజార్ జంక్షన్‌లో హారిక కన్స్ట్రక్షన్స్ ఇలిసిపురం మెగా యూత్ ఆధ్వర్యంలో ఆది పురుష్ వినాయకున్ని నిమజ్జనం చేశారు. ఆదివారం వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రదేశంలోనే నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా హారికా ప్రసాద్, సతీమణి శోభారాణి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా చరిత్రలోనే లేనివిధంగా 25 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి 13 రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి గణపతిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జెఎన్ టి నాయుడు, ఇలిసిపురం మెగా యూత్ సభ్యులు అప్పలనాయుడు, వాసు, సుకుమార్ పాల్గొన్నారు.


నిమజ్జనం చేస్తున్న సభ్యులు

మున్సిపల్ డిఇఇగా సునీల్‌కుమార్

పలాస: పలాస మున్సిపల్ కార్యాలయంలో డిఇఇగా జి.సునీల్‌కుమార్ ఆదివారం విధుల్లో చేరారు. ఈయన విశాఖపట్నం జివిఎంసి జోనల్ 1,2లో ఎఇగా పనిచేశారు. పదోన్నతిపై పలాస బదిలీపై వచ్చారు. గతంలో పని చేసిన ఇన్‌ఛార్జి డిఇ బల్ల హరి ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం టిడ్కో డిఇగా బదిలీ అయ్యారు.

టిడిపిలో చేరేసరికి మాపై నిందలా..!

ప్రజాశక్తి- పొందూరు

వైసిపి నుంచి టిడిపిలో తాము చేరేసరికి వారంతా టిడిపి వాళ్లేనని, కొత్తగా పచ్చ కండువాలు వేసి మోసగిస్తున్నారంటూ ఇప్పుడు తమపై వైసిపి నాయకులు నిందలు వేసి పత్రికా ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని మండలంలో రాపాక గ్రామానికి చెందిన కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని రాపాక గ్రామంలో టిడిపి నాయకులతో కలిసి శాలివాహన సంఘం సభ్యులు విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. వైసిపి విధానాలు నచ్చక తామంతా ఇటీవల టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరామన్నారు. గత ఎన్నికల సమయంలో తామంతా వైసిపికి మద్దతు తెలిపి, బ్యానర్లు కట్టి ఆ పార్టీకి పనిచేసిన విషయం స్థానిక వైసిపి నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పుడు పార్టీ మారేసరికి సహించలేక మాపై నిందలు మోపి పత్రికలలో తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదని తెలిపారు. ప్రస్తుతం వైసిపి అనుసరిస్తున్న విధానాలతో పాటు స్థానిక నాయకత్వంపై విసుగు చెంది మా సంఘానికి చెందిన సుమారు 40 కుటుంబాలుతో పాటు వివిధ సామాజిక వర్గాలకు చెందిన మరో 20 కుటుంబాలు టిడిపిలో చేరినట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తామంతా టిడిపి విజయానికి కష్టపడతామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కొంచాడ బుజ్జి, బలగ శంకర భాస్కరరావు, కొంచాడ అప్పలనాయుడు, మనోహరరావు, కొంచాడ సన్యాసిరావు, ఖండాపు శ్రీనివాసరావు, కె.వైకుంఠరావు, పంచాయతీ వార్డు సభ్యులు కె.నరేష్, కె.సన్యాసిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు


మాట్లాడుతున్న సురేష్‌బాబు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నియమించిన 104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు నాయకులు ఆర్.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హక్కులను పరిరక్షించుకోవడానికి ఉద్యోగులు సంఘంగా కలిసి ఉండాలన్నారు. 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బమ్మిడి లోకనాథం మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు నారాయణరావు, రాము, కన్నబాబు, రామారావు, సింహాచలం అసిరినాయుడు, ధనలక్ష్మి పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్

200 మందికి వైద్య పరీక్షలు

శ్రీకాకుళం : మండలం తాడివలస గ్రామంలో శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అధిక ఉష్ణోగ్రతలు కారణంగా ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎక్కువగా మంచినీరు, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి సుమారు 200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రిసిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధ జల కేంద్రం వితరణ

కవిటి: విశాఖపట్నానికి చెందిన జామి మధు, కుసుమ ప్రియ దంపతులు కవిటి చింతామణి అమ్మవారి ఆలయానికి శుద్ధ జల కేంద్రాన్ని అందించారు. ఈ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు సమక్షంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బి.వెంకటేశ్వరరావు, ఎ.మధు, ఆలయ కమిటీ సభ్యులు పొల్లాయి లక్ష్మణమూర్తి, ఎ.త్రివిక్రమ రావు, బి.రంగారావు, కె.మన్మథరావు, వి.నాని, వెంకటేశం, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఇఒ వీరభద్రస్వామి, నూకరాజు, సంతోష్ పాల్గొన్నారు.


శుద్ధ జల కేంద్రాన్ని అందిస్తున్న దాతలు

సచివాలయాలతో ప్రజల చెంతకు పాలన

ప్రజాశక్తి- జలుమూరు

సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన మరింతగా ప్రజలకు చేరువైందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని టెక్కలిపాడులో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో జల్జీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన ఇంటింటికి తాగునీరు పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా చీపురు పట్టి గ్రామంలోని రోడ్లను ఊడ్చారు. ముందుగా గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి పోస్టర్లను అందజేశారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గొల్లపేటలో రోడ్లు వేయించాలని, అంగన్వాడీ కేంద్రానికి భవనం లేదని, స్కూల్ ఆవరణ ఎత్తు చేయాలని గ్రామస్తులు కోరారు. అధికారులతో మాట్లాడి అన్ని పనులు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఇసి రాష్ట్ర సభ్యులు ధర్మాన పద్మప్రియ, ఎంపిపి వాన గోపి, మండలి అధ్యక్షుడు కనుసు సీతారాం, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దామ మన్మథరావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు పాల్గొన్నారు.


ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణదాస్

వైసిపికి ఇవే చివరి ఎన్నికలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపికి ఇవే చివరి ఎన్నికలని రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నేను సైతం బాబు కోసం రిలే నిరాహార దీక్షలో విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు. శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తెలుగుదేశంపార్టీ పేరు వింటేనే ముచ్చెమటలు పడుతున్నాయని, అందుకే ఆధారాలు లేని అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి ఓటమి తప్పదని ముఖ్యమంత్రికి ఇప్పటికే సర్వేలు, నిఘా సంస్థలు తెలియజేశాయన్నారు. లోపల భయపడుతూనే బయటికి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. టిడిపి పుట్టిన నాటి నుండి నేటి వరకు ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొందని ఇటువంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. చంద్రబాబు నాయుడును అక్రమ కేసులతో జైల్లో పెట్టి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని అది సాధ్యం కాని పనని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తెరగాలని సూచించారు. జైలు నుండి చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ముఖ్యమంత్రి పీఠం అధిరోహిస్తారని అన్నారు.

అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యుడు మబగాపు ఈశ్వరరావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మొదలవలస రమేష్, అంబళ్ల రాంబాబు, తమ్మినేని చంద్రశేఖర్, తంగి గురయ్య, నాగళ్ళ మురళి పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


మాట్లాడుతున్న నాయుడు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతిఒక్కరూ వన్యప్రాణులను సంరక్షించాలని అటవీశాఖ అధికారి ఎ.ఎం.కె నాయుడు అన్నారు. మండలంలోని తేలుకుంచిలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కింగ్ కోబ్రా, పునుగుపిల్లి, కలివికోడి, సముద్ర తాబీ, రాబందులు, పిచ్చుకలు కనిపిస్తే చంపకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మొ? నవి అంతరించిపోయే జాబితాలో ఉన్నాయి. సృష్టిలో ప్రతి జీవి ముఖ్యమైదన్నారు. ఏ జీవ జాతి కనుమరుగైనా ఆహారపు గొలుసు దెబ్బతింటుందన్నారు. దీంతో ఇతర జాతుల వినాశానికి దారితీస్తుందన్నారు. తద్వారా మానవ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రజలు సమతుల్య వాతావరణాన్ని నిర్వహించడానికి సహాయ పడాలన్నారు. మనం పీల్చే గాలి, తినే ఆహారం, ఉపయోగించే శక్తి, కట్టుకునే దుస్తులు వంటి అనేక ప్రయోజనాలు ప్రకృతి మొక్కలు, జంతువుల నుంచి పొందుతున్నామని అన్నారు. ప్రకృతికి సహజ సిద్ధంగా ఉన్న జీవ వైవిధ్యం ఎంతో అవసరమని అన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మొక్కలు నాటాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రాజశేఖరరెడ్డి, మెరుగు సూర్యనారాయణ, అటవీశాఖాధికారులు రాము, భానుమూర్తి, సురేష్, వెంకటేష్, దుర్గాదేవి, జోగారావు, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

7, 8న పిఒడబ్ల్యు రాజకీయ తరగతులు

పలాస: ఈ నెల 7, 8 తేదీల్లో పలాసలోని గణపతి రెసిడెన్సిలో పిఒడబ్ల్యు రాష్ట్ర రాజకీయ తరగతులు నిర్వహిస్తున్నట్లు పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బి.ఈశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు స్థానిక న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా, స్త్రీ పురుషుల సమానత్వం కోసం అహర్నిశలు పోరాడుతున్నామని అన్నారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళలపై నిత్యం హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. మణిపూర్‌లో ఆరేడు నెలలుగా మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న ప్రధానమంత్రి నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటనపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నా... తర్వాత మోడీ నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందన్నారు. మహిళలపై సనాతన సంప్రదాయం పేరుతో అణిచివేతలు మరింత పెరిగాయని అన్నారు. నిత్యవసర వస్తువులు నింగిన తాకడంతో కుటుంబాన్ని ముందుకు నడపడంలో మహిళలు అనేక బాధలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్, పెట్రోలు నిత్యవసర వస్తువులు ధరలు నింగిని తాకాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై భారాల మోపి నడ్డి విరుస్తున్నారన్నారు. ఉద్యోగం, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. కార్యక్రమంలో కె.సిహాసిని, సరస్వతి, స్వాతి, గీత, రాజేశ్వరి, నాగమణి పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అరసవల్లికి విఐపిల తాకిడి

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్య నారాయణ స్వామి ఆలయానికి ఆదివారం విఐపిల తాకిడి పెరిగింది. విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక, ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ సెంట్రల్ ఎక్సైజ్ చీఫ్ కమిషనర్ ఎస్.జె.సత్యేంద్రకుమార్ సింగ్, రాజ్యసభ సభ్యులు గుంటుపల్లి వెంకటక్ష్మి, నరసింహరావు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.మాల దర్శించుకున్నారు. వారికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారి సేవల అనంతరం వారిని శేష వస్త్రాలను కప్పి చిత్రపటాలను అందజేశారు.


చిత్రపటాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి రాధిక

రూ.5.24 లక్షల ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి సందర్శకుల తాకిడి పెరిగింది. దక్షిణాయణ కాలంలో రద్దీ పెరగడంతో టిక్కెట్ల రూపేనా రూ.2,27,200, విరాళాల రూపంలో రూ.1,21,504, ప్రసాద విక్రయాల ద్వారా రూ.1,75,000 ఆదాయం సమకూరినట్టు ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

వైసిపి బలోపేతానికి కృషి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భాస్కరరావు

వజ్రపుకొత్తూరు : పార్టీ కోసం కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. జిల్లా జిల్లా డాక్టర్స్ సెల్ జనరల్ సెక్రెటరీగా నియమితులైన వైసిపి నాయకులు, పల్లివూరు సర్పంచ్ మామిడి భాస్కరరావు మంత్రిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తనకు డాక్టర్ సెల్ జనరల్ సెక్రెటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమలపాడు సర్పంచ్ దున్న బాలరాజు, సవరయ్య, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వైసిపికి కొత్తగా ఎన్నికైన పార్టీ అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. నూతనంగా ఎన్నికైన తేలుకుంచి సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్ మండల పరిషత్ కార్యాలయంలో సాయిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టౌన్ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన బలివాడ ప్రకాష్ పట్నాయక్‌కూ కలిశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేస్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, ఉప్పడ రాజారెడ్డి, వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద రెడ్డి, కారంగి మోహనరావు, చిటటిబాబు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తామని నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు బగాది హరి, తమిరి ఫాల్గుణరావు, నూక సత్యరాజ్, జీరు బాబూరావు అన్నారు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి స్వగృహంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సంపతరావు రాఘవరావు, దువ్వాడ హైందవి మోహన్, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, మొర్రి శంకర్, కోరాడ కామేష్, ఎంపిపి ప్రతినిధి ఆట్ల రాహుల్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వైద్యులు ఉలాల శేషు యాదవ్‌ను వైసిపి డాక్టర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈయనకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య, పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్ హర్షం వ్యక్తం చేశారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ దానకర్ణుడు

రామచంద్రాపురంలో 'పొలంబడి'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో రామచంద్రపురంలో మండల ఎఒ ఎస్.దానకర్ణుడు ఆధ్వర్యాన ఆదివారం డాక్టర్ వైఎస్ఆర్ 'పొలంబడి' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు సదుపాయకర్త అప్పారావు పొలంలో పొలంబడి నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. మిత్ర, శత్రు పురుగులు నిష్పత్తిని వివరించారు. ఈ నిష్పత్తిని ఆధారంగా చేసుకుని పంటలపై వాడే పురుగు తెగులు మందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎండయ్య, సర్పంచ్ గూడ వసంతకుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు నరేంద్ర పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నరసన్నపేట: నరసన్నపేటలోని ఎంఎల్ఆర్ నాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం మెగా రక్తదాన, వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముద్దాడ బాలభూపాలనాయుడు తెలిపారు. ఆదివారం కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా, గాంధీ జయంతిని పురస్కరించుకుని ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటలు వరకు వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వామినాథన్ మృతి తీరని లోటు

పలాస : హరిత విప్లవ పితామహుడు, రైతు జన బాంధవుడు స్వామినాథన్ అని, ఆయన మృతి దేశానికి తీరని లోటని ఏపి జేడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అన్నారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో జేడి రైతుల సంఘం ఆధ్వర్యాన స్వామినాథన్ సంతాపసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామినాథన్ వ్యవసాయ రంగంలో చేసిన విశేష పరిశోధన ఫలితంగా దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించిందన్నారు. ముఖ్యంగా రైతు మద్దతు ధర విషయంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

సిఫార్సులు అమలు చేయక రైతాంగ వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, జేడి రైతు సంఘ నాయకులు కారి పురుషోత్తం, రైతులు టి.రాజు, తెప్పల తాతారావు, ఎంపల్ల జోగారావు, పుక్కల్ల తాతారావు, జుత్తు కిషోర్ పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలతో వాటర్ ట్యాంకు

శిథిలావస్థలో రక్షిత పథకం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలిలో ఏళ్ల కిందట నిర్మించిన తాగునీరు అందించే రక్షిత తాగునీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. ఈ పథకాలకు పిచ్చి లోడడం నాచు పట్టి పిచ్చి మొక్కలు తోడయ్యాయి. పైగా గ్రామానికి సరిపడా నీరు అందించలేని దుస్థితి ఏర్పడింది. గ్రామ జనాభాకు తగినంత తాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామ జనాభా మూడు వేలు మంది ఉండగా, గ్రామానికి మరో అదనపు వాటర్ ట్యాంకు అవసరం ఉంది. ఉన్న ట్యాంకు సరిపడా నీరు అందించలేకపోవడం, పైగా శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు తక్షణం మరో కొత్త ట్యాంకు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మెయిన్ రోడ్డు వీధిలో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి పరచాలని స్థానికులు అంటున్నారు. వర్షం పడుతున్న సమయాల్లో మురుగుగా తయారవుతుందని వారు ఆవేదన చెందుతున్నారు. రోడ్లపై నీరు నీరు చేరడంతో నడిచి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని అన్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెందడంతో పలు రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. వైద్య సిబ్బంది స్పందించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అధికారులు గ్రామాభివృద్ధిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత



టెక్కలి రూరల్ : నగదు అందజేస్తున్న సరోజనమ్మ

టెక్కలి రూరల్: మండలంలోని కొనుసులకొత్తూరులో జలుమూరు సరోజనమ్మకు వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయ కింద రూ.పది వేలు సర్పంచ్ మొర్రి శంశరరావు ఆదివారం అందజేశారు. ఇటీవల అనారోగ్యం ఆమె భర్త జలుమూరు ఎర్రయ్య మృతి చెందారు. ఈయనకు వైఎస్ఆర్ బీమా వర్తించడంతో నగదును అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కలిశెట్టి చంద్రరావు, విఆర్ఒ మెట్ట జనక్ మోహన్, చాకిపల్లి కార్యదర్శి పెయ్యల రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మెండ లోకేశ్వరరావు, వాలంటీర్లు రాంప్రసాద్, రాజారెడ్డి పాల్గొన్నారు.

పొందూరు: మండలం లోలుగు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సింగుపురపు చిట్టెమ్మ కుటుంబ సభ్యులకు వైయస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలును ఆదివారం జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ ఖాతాలో జమచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లోలుగు లక్ష్మునాయుడు, వైస్ సర్పంచ్ చంద్రరావు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ వీరాస్వామి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న జైహింద్ ఫౌండేషన్ సభ్యులు

క్యాన్సర్ బాధితునికి అండ

కవిటి : మండలం రాజపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితుడు బత్తిన రాముకు స్థానిక జైహింద్ సేవా ఫౌండేషన్ అండగా నిలిచింది. రాము గత కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జైహింద్ సేవ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం తమవంతుగా అతనికి రూ.8 వేలు తక్షణ సహాయంగా అందజేశారు. రాముకు దాతలు అండగా నిలవాలని కోరారు.

వృద్ధులను ఆదుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : వృద్ధుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందువల్ల పూర్తి సహకారాన్ని అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బలివాడ మల్లేశ్వరరావు కోరారు. ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆనంద నిలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధుల ప్రయాణ సౌకర్యంలోని రాయితీలను అమలు చేయాలని కోరారు. వృద్ధులకు ఎక్కడైనా సమస్య తలెత్తితే అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, వికలాంగులశాఖ ఎడి కె.కవిత, నిక్కు అప్పన్న, పి.వైకుంఠ రావు, కె.సోమసుందరరావు, పి.నరసింహమూర్తి, ఎం.ఎస్. ఆర్.ఎస్.ప్రకాశరావు, .పి.ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.

కషాయంతో చీడపీడల నివారణ



కొత్తూరు : కషాయాన్ని తయారు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి – రణస్థలం రూరల్

కషాయంతో చీడ, పీడల నివారణ అవుతుందని యూనిట్ ఇన్‌ఛార్జి ఏసుబాబు అన్నారు. మండలంలోని రావాడ, లంకపేట, ఎర్రవరం గ్రామాల్లో ఆదివారం సామూహికంగా జిల్లేడు కషాయం 200 లీటర్ల చొప్పున తయారు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వరిలో రసం పీల్చేపురుగు, పొటాష్ లోపం ఉన్నా నివారణకు ఉపయోగపడుతుందని, అలాగే ఈ కషాయం కావలసిన పరికరాలు ఆవు మూత్రం 20 లీటర్లు, నీరు 200 లీటర్లు, జిల్లేడు ఆకులు 10 కేజీలు తీసుకొని 200 లీటర్లు నీటిలో జిల్లేడు ఆకుల ముద్దను వేసి 20 లీటర్ల మూత్రం వేసి ఈ మొత్తాన్ని కలిపి తయారు చేసుకోవాలన్నారు. ఈ కషాయం మూడు రోజుల పాటు ఉదయం, సాయంత్రం కలుపుకోవాలని, అప్పుడు ఈ కషాయం తయారవుతుందన్నారు. ఈ విధంగా తయారైన కషాయాన్ని 100 లీటర్ల నీటిలో పది లీటర్ల జిల్లేడు ద్రావణం కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిఎస్ రమణమ్మ, సూర్యం, జనార్ధన, జయలక్ష్మి, సుజాత, సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని ఎల్.ఎన్.పురంలో జిల్లేడు కషాయాన్ని ఆదివారం తయారు చేశామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమశేఖర్, అప్పారావు, గోపాల్ తెలిపారు. తయారీ విధానానికి కావాల్సిన పదార్థాలు డ్రమ్ములో 100 లీటర్ల నీరు, 10 కేజీల జిల్లేడు ఆకులు, 10 లీటర్ల ఆవు మూత్రం సమకూర్చుకోవాలన్నారు. ఈ విధంగా వేసుకొని ఉదయం, సాయం కాలం సవ్యదశలో కలపాలని సూచించారు. ఈ కషాయం నాలుగు రోజుల్లో తయారవుతుందని తెలిపారు. ఈ కషాయం ఏడు రోజులు నిల్వ ఉంటుందని తెలిపారు. ఈ కషాయం ఉపయోగాలు అన్ని రకాల పోషకాలకు, ముఖ్యంగా పటాస్ లోపానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రసం పీల్చే పురుగులకూ ఈ కషాయం వల్ల నాశనం అవుతాయని తెలిపారు.

కొత్తూరు: స్థానిక అల్లు వీధిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన 200 లీటర్ల జిల్లెడు ద్రావణం తయారు చేవారు. కార్యక్రమంలో ఎంటి సత్యనారాయణ, వి.చిన్నమ్మి, రమణమ్మ పాల్గొన్నారు.